రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా పనులు చేయాలి



సాయినగర్ ఈస్ట్‌లో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ సాయినగర్ ఈస్ట్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా ముందస్తు ప్రణాళికతో పనులను పూర్తి చేయాలన్నారు. నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డుకు క్యూరింగ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా సాయినగర్ ఈస్ట్ ప్రధాన రహదారిలో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను కూడా ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, శివరాజ్‌గౌడ్, ప్రకాష్, పార్వతీశ్వర్‌రావు, రంగారావు, భాస్కర్, శేఖర్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మధురెడ్డి, మోజెస్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

30న బ్రాహ్మణ ఐటీ ప్రొఫెషనల్స్ సత్కార మహోత్సవం

కూకట్‌పల్లి: బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో బ్రాహ్మణ ఐటీ ప్రొఫెషనల్స్ సత్కార మహోత్సవం కార్యక్రమం ఈనెల 30న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, 12 నుంచి ఒంటి గంట వరకు చర్చా గోష్ఠి, 1 నుంచి 2 గంటల వరకు భోజన కార్యక్రమం, 2 నుంచి 2.30 గంటల వరకు ముఖ్యఅతిథులకు ఆహ్వానం, జ్యోతి ప్రజ్వలన, 2.30 నుంచి 4.30 గంటల వరకు అతిథుల ప్రసంగం, సన్మాన సత్కార్యాలు వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా బ్రహ్మశ్రీ బంగారయ్య శర్మ, తత్త్వం చారిటబుల్ ట్రస్ట్ అధినేత, గౌరవఅతిథి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రత్యేక అతిథిగా ప్రముఖ సినీనటుడు ప్రదీప్ పాల్గొనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం కేపీహెచ్‌బీకాలనీలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

యాంటీ డ్రగ్ ర్యాలీ



శిల్పకళావేదికలో బుధవారం జరిగిన యాంటీ డ్రగ్ డే కార్యక్రమానికి జేఎన్‌టీయూ నుంచి విద్యార్థినులు ర్యాలీగా వెళ్లారు. మాదకద్రవ్యాలను వాడొద్దని నినదించారు. – కేపీహెచ్‌బీకాలనీ

అసంపూర్తిగా లింకు రోడ్డు పనులు

చందానగర్ రైల్వే ట్రాక్ వరకు పనులు పూర్తి



చందానగర్ రైల్వే ట్రాక్ వద్ద నిలిచిపోయిన లింక్ రోడ్డు పనులు

హఫీజ్‌పేట్: సంవత్సరాలు గడుస్తున్నా లింకు రోడ్డు పూర్తి కాకపోవడంపై ఎప్పటికి పూర్తి చేస్తారంటూ స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ముంబై జాతీయ రహదారి, మైహోమ్ జువెల్, చందానగర్ రైల్వే స్టేషన్ ట్రాక్ మీద నుంచి ఆర్టీసీ కాలనీ, శేరిలింగంపల్లి సర్కిల్‌– 20 కార్యాలయం వరకు హెచ్‌ఆర్‌డీసీ ప్రాజెక్టు కింద రోడ్డు పనులు చేపట్టారు. ఇందులో చందానగర్ రైల్వే ట్రాక్ వరకు పనులు పూర్తి చేశారు. కాగా చందానగర్ రైల్వే ట్రాక్ మీదుగా ఆర్టీసీ కాలనీ ముంబాయి జాతీయ రహదారి వద్ద ఉన్న జీఎస్‌ఎం మాల్ వరకు పనులకు ఆటంకం ఏర్పడింది. పలు కాలనీలవాసులు లింకురోడ్డు వల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతాయంటూ కోర్టు మెట్లు ఎక్కారు. దీంతో ఏళ్లు గడుస్తున్నా సమస్య అలాగే ఉంది.

- ఆర్టీసీ కాలనీ నుంచి ముంబై జాతీయ రహదారి లింక్ రోడ్డు పూర్తి అయితే ట్రాఫిక్ కష్టాలకు చెక్.

- అక్కడి నుంచి అభ్యంతరాలతో అడ్డంకులు
- ఫ్లైఓవర్‌కు అనుమతి వచ్చినా ప్రారంభం కాని పనులు

- చందానగర్, మియాపూర్, మదీనాగూడ ఐటీ ఉద్యోగులకు ట్రాఫిక్‌తో పాటు దూరం, సమయం ఆదా అవుతుంది.
- రైల్వే అధికారుల నుంచి ఫ్లైఓవర్ నిర్మాణానికి అనుమతులు వచ్చినా పనులు ప్రారంభించ లేదు.
- ఆర్టీసీ కాలనీవాసుల అభ్యంతరం తొలిగితేనే ఫ్లైఓవర్ పనులు మొదలుపెడతారని సమాచారం.

వెంటనే లింక్ రోడ్డు పనులు ప్రారంభించాలి



చందానగర్ రైల్వేస్టేషన్ సమీపంలో అసంపూర్తిగా ఉన్న లింక్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి. మియాపూర్, మదీనాగూడ ప్రాంతాల నుంచి గచ్చిబౌలికి వెళ్ళే వారికి దూరం తగ్గడంతో పాటు కంపెనీలకు చేరుకోవడం సులువుగా ఉంటుంది.

–చారి, వాహనదారుడు

ఫ్లైఓవర్‌కు అనుమతులు వచ్చాయి



ఆర్టీసీ కాలనీ, చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతులు వచ్చాయి. త్వరలోనే ఫ్లైఓవర్ల నిర్మాణ ప్రణాళికలను సిద్ధం చేసి పనులు ప్రారంభిస్తాం.

–ఎమ్మెల్యే గాంధీ





ఆర్టీసీకాలనీ వద్ద జనవాసాల మీదుగా ముంబై జాతీయ రహదారికి లింక్ రోడ్డు ఫ్లైఓవర్ నిర్మించాల్సిన ప్రాంతం

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలి

కాండూరి నరేంద్రాచార్య

బాలానగర్: భారతదేశ సార్వభౌమాధికారానికి నిలయమైన పార్లమెంట్ నిండుసభలో పార్లమెంట్ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన అసదుద్దీన్ ఒవైసీ 'ఫలస్తీన్ కు జై' అని చెప్పడం సిగ్గుచేటని మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్య ప్రశ్నించారు. అతడిని గెలిపించిన హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు మనోభావాలను దెబ్బతీశాడని అన్నారు. అసదుద్దీన్ ఓవైసీ తక్షణం భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాక్షేత్రంలో మూల్యం చెల్లించక తప్పదన్నారు.

నేటి నుంచి రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని రంగనాయకస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుంచి జులై 3వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం అంకురార్పణ, 28న అగ్ని ప్రతిష్ఠ, నిత్య హోమం, గరుడ ధ్వజారోహణ, సంతాన ప్రద ప్రసాద గోష్ఠి, 29న నవకలశ స్నపనం, అభిషేకం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

వాటర్ పైప్‌లైన్ పనులు పరిశీలన



కల్వరి టెంపుల్ ప్రాంతంలో నిర్మిస్తున్న వాటర్ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: కల్వరి టెంపుల్ నుంచి 4వ ఫేజ్ ఎస్‌టీపీ ప్లాంట్ వరకు జరుగుతున్న వాటర్ పైపులైన్ పనులను కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ... పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యూస్ డీజీఎం శంషీద్, మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆహ్వానం

కూకట్‌పల్లి: జగన్నాథ రథయాత్రలో పాల్గొనాలని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ను కూకట్‌పల్లి ఇస్కాన్ సభ్యులు కలిసి ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం నియోజకవర్గ నాయకుడు ఏకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి ఇస్కాన్ ఆలయ సభ్యులు జగదీశ్వర్‌గౌడ్‌కు శాలువాతో సన్మానించారు. ఈనెల 7వ తేదీన నిర్వహించే రథయాత్రలో పాల్గొనాలన్నారు.

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ నిందితులను శిక్షించాలి



మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ కూకట్‌పల్లి అధ్యక్షుడు సీహెచ్. వంశీప్రసాద్‌గౌడ్

మోతీనగర్: నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి కారకులైన వారిని బహిరంగంగా శిక్షించాలని లోక్‌సత్తా పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం అధ్యక్షుడు సీహెచ్. వంశీప్రసాద్‌గౌడ్ డిమాండ్ చేశారు. అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ... నీట్ ప్రశ్నాపత్రం లీకేజీతో ఎంతోమంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి తిరిగి పరీక్ష నిర్వహించాలన్నారు. విద్యార్థులకు సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, జనార్దన్, కురమయ్య, మహేష్, శివ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తున్నాం

మూసాపేట: భరత్‌నగర్ ఈడబ్ల్యూఎస్‌కాలనీలో బుధవారం మూసాపేట కార్పొరేటర్ మహేందర్ బస్తీ పర్యటన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గల్లీ గల్లీ తిరుగుతూ స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. డ్రైనేజీ, మంచినీరు, రోడ్ల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌గౌడ్, డాకయ్య, ఐలయ్య, విజయ భవాని, అభిలాష్, స్వామి పాల్గొన్నారు.



గల్లీల్లో పర్యటిస్తూ నేరుగా సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మహేందర్

తాగునీటి లీకేజీకి చెక్.!



మంచినీటి లీకేజీకి మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మోతీనగర్: 'తాగునీరు రోడ్డుపాలు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సంబంధిత జలమండలి మేనేజర్ విలియం ప్రకాష్ స్పందించి వాటర్ వాల్వ్ లీకేజీకి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలి: ఏబీవీపీ



కూకట్‌పల్లి ప్రభుత్వ పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

కూకట్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని... ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు అదుపు చేయాలని ఏబీవీపీ ఇచ్చిన రాష్ట్రవ్యాప్త బంద్ ప్రశాంతంగా జరిగింది. కూకట్‌పల్లి నియోజకవర్గంలో అక్కడక్కడా తెరిచిన పలు పాఠశాలలను బుధవారం ఏబీవీపీ నాయకులు బంద్ చేయించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో బుక్స్, యూనిఫారం అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డీఈఓ, ఎంఈఓలను నియమించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం విషయంలో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని కోరారు. మెగా డీఎస్సీ ద్వారా 24వేల ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

మాక్‌డ్రిల్





మూసాపేట: బాలానగర్ జోన్ డీసీపీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు పోలీస్ సిబ్బందితో కలిసి బుధవారం కూకట్‌పల్లిలోని అశోకా మాల్‌లో ఎమర్జెన్సీ పరిస్థితిలో సిబ్బంది పాటించాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. పలు సూచనలు, సలహాలు చేశారు. కైత్లపూర్, భాగ్యనగర్‌కాలనీలోని బస్టాప్‌లో వాహనాల తనిఖీ చేసి 10 వాహనాలను సీజ్ చేశారు. జనాలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కల్గించే వారిపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చిన్న చిన్న కేసులు నమోదు చేశారు. కూకట్‌పల్లి సీఐ కృష్ణమోహన్, ఎస్సైలు, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

సాహు మహరాజ్ జీవితం స్ఫూర్తిదాయకం

లిబర్టీ: దళితుల అభ్యున్నతి, ప్రగతి కోసం సాహు మహరాజ్ జీవితాంతం పోరాటం సాగించారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వెన్న సదానందు అన్నారు. సాహు మహరాజ్ ఉదద్యమ స్ఫూర్తిని పోరాటపటిమను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. సాహు మహరాజ్ జయంతి పురస్కరించుకొని మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాహు మరాజ్ రిజర్వేషన్లు సాధించడంలో ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. సామాజికంగా వెనుకబడిన దళితులకు బీసీలకు రిజర్వేషన్ల కల్పన కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. దళితులు, బీసీలు, ఇతర వర్గాలకు రిజర్వేషన్లు అందుతున్నాయని అంటే ఆనాడు సాహు మరాజ్ వేసిన బీజమేనని సాధారణంగా గుర్తు చేశారు. కేవలం వెనుకబడిన వర్గాలకే మాత్రం కాకుండా ఎస్సీలకు, సామాజికంగా ఉన్నత స్థానంలో ఉండాలని రిజర్వేషన్ల కోసం ఆనాడే కృషి చేశారని పేర్కొన్నారు. సాహు మహరాజ్ ఆశయ సాధన కోసం పని చేయాలని సూచించారు.

స్వచ్ఛంద సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలి

లిబర్టీ: ప్రజాహితం కోసం పని చేస్తూ పేద వర్గాలకు చేయూతనిస్తున్న సంస్థలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు, ఎన్విరాన్మెంటల్ సంస్థ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఆదినారాయణ కోరారు. నిత్యం ప్రజలకు సేవలు అందిస్తున్న సమస్తకు కేంద్ర ప్రభుత్వం బాసటగా నిలవాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రి, పార్లమెంటు సభ్యుడు అనురాగ్‌ఠాకూర్‌కు వినతిపత్రం సమర్పించి అందిస్తున్న సేవలను వివరించారు. ఈసందర్భంగా ఆయన ఆత్మీయ సత్కారం చేశారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో తెలుగు రాష్ట్రాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ఆదిలీలా ఫౌండేషన్‌కు కేంద్ర ప్రభుత్వం చేయూతనివ్వాలని విన్నవించారు. ప్రధానితో మాట్లాడి సహకారం అందించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారన్నారు.

డివిజన్‌ల సమస్యలను వెంటనే పరిష్కరించండి

అధికారులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదులపై ఎమ్మెల్యే కృష్ణారావు స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దీన్‌దయాల్ నగర్ నాలా, భరత్‌నగర్ నాలా నిధుల మంజూరు అయ్యాయని పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని దీనిని దృష్టిలో ఉంచుకొని ఇకనైనా అధికారులు స్పందించి నాలా పనులను డ్రైనేజీ, రోడ్లు, పనులు వీధి దీపాలు సమస్యలు, శానిటేషన్, పాగింగ్ వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానికులు, పలు అసోసియేషన్ నాయకులు ఇచ్చిన ఫిర్యాదులపై స్పందించిన ఆయన పనులు వేగవంతం చేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, రాములన్న, అధికారులు, అసోసియేషన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దయార్‌గూడలో సమస్యలు పరిష్కరించండి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో దయార్‌గూడ వాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, గ్రేవ్ యార్డ్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనేక రోజులుగా సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని కాముని చెరువు, మైసమ్మ చెరువు, ముళ్లకత్వ చెరువుల్లో కాలుష్యం పెరిగిపోయి దోమలతో ఇబ్బందిపడుతున్నామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు రెయిన్‌బో విస్టాస్ అధ్యక్షులు బండి మధుసూదన్‌రెడ్డి, అసోసియేషన్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కాముని చెరువు, మైసమ్మ చెరువు, ముళ్లకత్వ చెరువులు కలుషితమయ్యాయని, గుర్రపుడెక్కతో దోమలు ప్రబలాయని తెలిపారు. ఈ చెరువుల చుట్టుపక్కల దాదాపు 10 వేల పైచిలుకు జనాభా కలిగిన రెయిన్‌బో విస్టాస్ రాక్ గార్డెన్, 1,290 కుటుంబాలు 4 వేల పై చిలుకు జనాభా, రెయిన్‌బో విస్టాస్ ఫేజ్ 1లో 450 కుటుంబాలు దాదాపు 2 వేల మంది జనాభా, చుట్టుపక్కల కాలనీలైన సేవాలాల్ నగర్, రాఘవేంద్ర నగర్, కైత్లాపూర్, మైస్టిక్ హిల్స్, సఫ్దార్‌నగర్, ఆంజనేయ నగర్, గాయత్రినగర్ కాలనీలవాసులు దోమల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అదే విధంగా కైత్లాపూర్, సేవాలాల్ నగర్ మధ్య ఉన్న ఇరుకైన రోడ్డు విస్తరణకు నోచుకోక ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. ఈ సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కృష్ణారావుకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రామిడి ప్రమోద్‌రెడ్డి, టి. రామ్‌కిరణ్, పూనపాటి దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు సహకరించండి

మోతీనగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ శాఖ ఆధ్వర్యంలో బాలానగర్ డివిజన్ ఇంద్రనగర్‌లో కొనసాగుతున్న ఆరోగ్య కేంద్రానికి సహాయ సహకారాలు అందించాలని బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును శాఖ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. తాము విన్నవించిన సమస్యలన్నింటికీ ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. శాశ్వత భవనం ఏర్పాటు చేయటానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సీహెచ్. సత్యనారాయణ, నాగుల సత్యం, రోణంకి జగన్నాథం, మురళీకృష్ణ, నాగరాజు, టీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రెయిన్‌బో విస్టాస్ ప్రతినిధులు

సైఫాబాద్ సైన్స్ కళాశాలపై దానకిషోర్ వరాల జల్లు

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కళాశాలపై ఉస్మానియా యూనివర్శిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ దాన కిషోర్ వరాల జల్లు కురిపించారు. ఇటీవల సైఫాబాద్ సైన్స్ కళాశాలను సందర్శించిన సమయంలో ఇక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ఆయన ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కళాశాలలో కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణార్థం ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణతో చర్చించి యూనివర్శిటీ బడ్జెట్ నుంచి రూ. 10 లక్షలను విడుదల చేయించారు. అలాగే కళాశాలలోని బాయ్స్ హాస్టల్‌లో ఓపెన్ జిమ్‌ను, గర్ల్స్ హాస్టల్‌లో ల్యాండ్ స్కేపింగ్ ఏర్పాటుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) నుంచి నిధులను విడుదల చేయించారు. అలాగే కళాశాలలో పచ్చదనం, జీవ వైవిధ్యాన్ని చూసి ముగ్ధులైన దానకిషోర్ కళాశాల ప్రాంగణంలో బొటానికల్ గార్డెన్ అభివృద్ధికి రూ. 95 లక్షల నిధులను హెచ్‌ఎండీఏ నుంచి విడుదల చేయించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ లక్ష్మీ నారాయణ, కళాశాల సిబ్బంది దానకిషోర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

మంత్రి సీతక్కపై అసత్య ఆరోపణలు మానుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉషాకిరణ్

పంజగుట్ట: రాష్ట్ర మంత్రి సీతక్కపై నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు చేస్తే సహించేది లేదని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉషాకిరణ్ హెచ్చరించారు. ఆదివాసీ గుడెం నుంచి మంత్రిగా ఎదిగి ప్రజాసేవ చేస్తున్న గిరిజన బిడ్డను చూసి ఓర్వలేక కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. సీతక్క దగ్గర ఎప్పుడో పనిచేసిన వ్యక్తి ఏదో ఇసుకవ్యాపారంలో దొరికితే ఇసుక వ్యాపారంలో సీతక్క పీఏ అని ప్రచారం చేస్తున్నారని అక్రమ ఇసుక వ్యవహారంలో సీతక్కకు కాని ఆమె పీఏకు కాని ఎలాంటి సంబంధం లేదని ఆరోపణలు చేస్తున్న వారు ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాల్ చేశారు. అసలు అక్రమదందా మొదలు పెట్టిందే బీఆర్‌ఎస్ నాయకులని, 2015లో ఇసుక సవరణ జీవో తీసుకువచ్చిందే వారని గుర్తుచేశారు. ఇదే విషయాన్ని తాము ప్రభుత్వం, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. ప్రజా కోర్టులో బీఆర్‌ఎస్‌ను ప్రజలు వ్యతిరేకించినా ఆ నాయకులకు ఇంకా బుద్ధిరాలేదని ఇకనైనా ప్రజలకోసమే జీవిస్తున్న నాయకురాలిపై అభాండాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి విభాగం అధ్యక్షులు మేడ శ్రీను, సాగబోయిన పాపారావు, నాగమణి, వలువాయి శ్రీను, దేవరాయ సురేష్, పాల్యా నాయక్ పాల్గొన్నారు.

చంద్రబాబు వర్గీకరణ వ్యాఖ్యలు రాజ్యాంగ వ్యతిరేకం

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

పంజగుట్ట: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేస్తామనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయనకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య హెచ్చరించారు. బుధవారం మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబు వ్యాఖ్యలు రాజ్యాంగ వ్యతిరేకమైనవని అన్నారు. గతంలో చంద్రబాబు చేసిన ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. జిల్లాల వారీగా వర్గీకరణ చేస్తామని అనడం కూడా రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఆందోళనలతో చంద్రబాబుకు మాలల తడాకా చూపిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాల మహానాడు జాతీయ నాయకులు గోపూజు రమేష్, బైండ్ల శ్రీనివాస్, బంగి ఆనంద్ కుమార్, గోకుల్ కళ్యాణ్, గిరి, ఓబులేష్, ఎల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌హెచ్ యూనివర్శిటీకి అరుదైన అవార్డు

బంజారాహిల్స్: ఐఐటీ హైదరాబాద్ నిర్వహించిన పీఏఎల్‌ఎస్ హబ్ ఈవెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందని కేఎల్‌హెచ్ యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ పార్థసారథి వర్మ అన్నారు. పీఏఎల్‌ఎస్ కార్యక్రమం కింద వివిధ కార్యక్రమాల్లో విద్యార్థులు, అధ్యాపకులు అసాధారణ ప్రతిభకు గాను ఈ అవార్డులు వరించాయన్నారు. దాదాపు 28 ఈవెంట్లలో తమ విద్యార్థులు చురుకైన పాత్ర పోషించారన్నారు.